# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం 14 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఉద్యోగులకు 3.64 శాతం డీఏ పెంపు

### ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వారికి 3.64 శాతం డీఏ పెంచింది. ఈ మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంచిన డీఏ 2023 జనవరి 1 నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉద్యోగులకు రెండు డీఏలు ఇవ్వాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఒక డీఏ ఇచ్చిన ప్రభుత్వం ఆరు నెలల తర్వాత మరో డీఏను ఇవ్వనున్నది.



## పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. శుక్రవారం ఉదయం ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్‌పై ముందస్తు దాడులకు దిగింది. అణు కర్మాగారాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. దేశ రాజధానిలో పేలుళ్ల శబ్దం వినిపించడంతో స్థానికులు భయాందోళలనలకు గురయ్యారని ఇరాన్ అధికార మీడియా వెల్లడించింది. అయితే ఇజ్రాయెల్ దాడులను తిప్పికొట్టేందుకు ఇరాన్ సైన్యం పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉందని పేర్కొంది. ఇరాన్ అణు స్థావరాలే లక్ష్యంగా దాడి చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. టెహ్రాన్ ప్రతిదాడులు చేసే అవకాశం ఉండటంతో దేశంలో అత్యవసర పరిస్థితులను ప్రకటించింది. తమ ఆపరేషన్ నేపథ్యంలో ఇరాన్ కూడా డ్రోన్లు, క్షిపణులతో ప్రతిదాడులకు దిగే అవకాశం ఉందని ఇజ్రాయెల్ రక్షణ మంది కాట్జ్ తెలిపారు.

కాగా, 'అది అత్యంత ప్రమాదకరమైన ప్రదేశం కావచ్చు. మా సైనిక కుటుంబాలను, దౌత్య సిబ్బందిని అక్కడి నుంచి తరలిస్తున్నాం. ఆ ప్రాంతాన్ని వీడాలని ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. ఇకపై ఏం జరుగుతుందో చూడాలి' అంటూ పశ్చిమాసియాను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన కొన్ని గంటల వ్యవధిలోనే టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ వైమానికి దాడులకు దిగడం గమనార్హం.

ఈ ఆకస్మిక దాడిలో దేశ సైనిక వ్యవస్థకు మూలస్థంభాలుగా ఉన్న ముగ్గురు అత్యున్నత స్థాయి సైనికాధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు చెలరేగాయి. వ్యూహపరంగా కీలకమైన నేతల కోల్పోవడం ఇరాన్‌కు తీరని దెబ్బగా మారింది. మేజర్ జనరల్ హుస్సేన్ సలామీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కు ఈయనే చీఫ్. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమెనెయికి అత్యంత విశ్వసనీయుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి. గత సంవత్సరం ఇజ్రాయెల్‌పై జరిగిన భారీ డ్రోన్, క్షిపణుల దాడులకు ఈయన ప్రధాన నిర్వాహకుడిగా నిలిచారు. అణు, క్షిపణి కార్యక్రమాల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషిస్తూ వచ్చారు.

మేజర్ జనరల్ మొహమ్మద్ బాగెరీ ఇరాన్‌లోని సుమారు 5 లక్షల మందితో కూడిన సైనిక దళానికి మోహమ్మద్ బాగెరీ అధిపతి. దేశంలోని అన్ని సైనిక కార్యకలాపాలను సమన్వయపరచే బాధ్యత ఆయనదే. అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ, ఆయన అంతర్జాతీయ శాంతి చర్చలలో భాగస్వామిగా కూడా పనిచేశారు, ముఖ్యంగా సౌదీ అరేబియాతో సంబంధాల పునరుద్ధరణలో. అలీ షమఖానీ (మాజీ జాతీయ భద్రతా చీఫ్) ఇరాన్ జాతీయ భద్రతా మండలిని సుదీర్ఘంగా 10 సంవత్సరాలపాటు నేతృత్వం వహించారు. దేశ భద్రతా వ్యూహాల రూపకల్పనలో ప్రసిద్ధి చెందిన వ్యూహకర్త. చైనా మధ్యవర్తిత్వంతో ఇరాన్–సౌదీ మధ్య దౌత్య సంబంధాల పునరుద్ధరణలో ఆయన పాత్ర అత్యంత ముఖ్యమైనది. ఇరాన్ అధ్యక్ష పదవికి కూడా ఈయన పోటీ చేశారు.

అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇజ్రాయెల్ దాడి కారణంగా ఇరాన్ తమ గగనతలాన్ని శుక్రవారం మూసివేసింది. ఈ పరిణామాలతో ముంబై నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ130ను అత్యవసరంగా దారి మళ్లించాల్సి వచ్చింది. లండన్ హీత్రూముంబై విమానం వియన్నాకు మళ్లించారు. ఎఐ102న్యూయార్క్ ఢిల్లీ విమానాన్ని షార్జాకు, ఏఐ116 న్యూయార్క్ ముంబై విమానం జెడ్డాకు మళ్లించారు. ఎఐ2018 లండన్ హీత్రూ ఢిల్లీ విమానం ముంబైకి, ఏఐ 129 ముంబైలండన్‌హీత్రూ విమానం,ఏఐ 119ముంబైన్యూయార్క్ తిరిగి ముంబైకి రప్పించారు. ఏఐ 103ఢిల్లీ నుంచి వాషింగ్టన్‌కు వెళ్లవలసిన విమానాన్ని తిరిగి ఢిల్లీకి రప్పించారు.ఏఐ 106 న్యూయార్క్ ఢిల్లీ విమానాన్ని వియన్నాకు మళ్లించారు. అలాగే మొత్తం 16 విమానాలను ఎయిర్ ఇండియా దారి మళ్లించడమో, వెనక్కి పిలిపించడమో చేసినట్టు సమాచారం. ఇరాన్‌తో పాటు సమీప రీజియన్ల గగనతలం మూసివేయడంతో కొన్ని విమానాల రూట్లు సుదీర్ఘ దూర ప్రయాణం కానున్నాయని, కొన్ని రద్దు కావడం జరుగుతుందని ఇండిగో విమాన సంస్థ ఎక్స్‌లో వెల్లడించింది.

# విద్యా ప్రమాణాలు పెంచాలి

- ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు
- మౌలిక వసతుల కల్పనలో ఖర్చుకు వెనకాడొద్దు
- పిల్లలకు భాషా పరిజ్ఞానంతోపాటు నైపుణ్యాలు నేర్పించాలి
- కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు కుటుంబం, సమాజం పట్ల బాధ్యతను తెలియజేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డి
- విద్యాశాఖపై సీఎం సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడానికి అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యా శాఖ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. విద్యా ప్రమాణాలు పెంపు లక్ష్యంతో రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నట్టు వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. బోధన ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని చెప్పారు. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్‌లో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని హెచ్‌ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గ చూపుతున్నారని, డే స్కాలర్స్‌కూ ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. పిల్లలకు కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు కుటుంబం, సమాజం పట్ల వారి బాధ్యతను తెలియజేసేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తే వారు మానసికంగా దృఢంగా తయారవడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా రాణిస్తారని అన్నారు. సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు గారితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



ఫార్ములా–ఈ రేసు కేసులో మాజీ మంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొంది. మే26నే ఈ కేసులో విచారణకు రావాలని ఎసిబి నోటీసులు ఇచ్చింది. కానీ, విదేశీ పర్యటన ఉన్న కారణంగా రాలేనని కేటీఆర్ సమాధానం ఇచ్చారు. దీంతో ఇప్పుడు విచారణకు హాజరుకావాలని ఆయనకు మరోసారి నోటీసులు ఇచ్చింది.

### లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం.. సీఎం సిద్ధమా..?

అయితే ఈ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఫార్ములా–ఈ రేసు కేసులో విచారణకు జూన్ 16న హాజరు అవుతానని ఆయన పేర్కొన్నారు. బాధ్యత గల పౌరుడిలా తాను విచారణకు సహకరిస్తానని ఆయన తెలిపారు. పాలన చేతకాక.. ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం ఇది అని అన్నారు. మరోవైపు ఓటుకు నోటు కేసులో సిఎం రేవంత్‌ను కూడా ఏసీబీ విచారిస్తుందని.. లై డిటెక్టర్ పరీక్షలకు తాను సిద్ధమని.. సిఎం సిద్ధంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. జడ్జి సమక్షంలో ఇద్దరం లై డిటెక్టర్ పరీక్షలు చేయించుకుందామని సవాల్ విసిరారు. టివిల్లో ఈ పరీక్షలు లైవ్‌గా ప్రసారం చేస్తే.. ఎవరు నేరస్థులో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. తనతో పాటు లై డిటెక్టర్ పరీక్షలు చేయించుకునే దమ్ము ఉంటే ముందుకు రావాలని డిమాండ్ చేశారు. విచారణ పేరుతో ఇలా పదే పదే ప్రజాధనం వృథా చేయడం ఎందుకు అని అన్నారు.

## విమాన ప్రమాద స్థలాన్ని సందర్శించిన ప్రధాని మోడీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

విమాన ప్రమాదంలో బయటపడిన ఒకే ఒక్కడిని ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పరామర్శించారు. మృత్యుంజయుడిగా నిలిచిన అతని ఆరోగ్య పరిస్థితిని ప్రధాని స్వయంగా అక్కడ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంపై దేశ వ్యాప్తంగా అందరు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి కూడా ఈ ప్రమాదం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. అంతేకాదు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున కేంద్రం పరిహారం ప్రకటించిన సంగతి తెలిసిందే కదా.

అహ్మదాబాద్ చేరుకున్న ప్రధాని మోడీ ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుంచి అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ కు వెళ్లారు. అక్కడ ప్రమాదంలో గాయపడిన వారిని ప్రధాన మోడీ పరామర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ వెంట గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తో పాటు ఆ రాష్ట్ర హెూం మినిష్టర్ తో పాటు కేంద్ర పౌరవిమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఉన్నారు. మరోవైపు ఈ ఘటన జరిగిన స్థలాన్ని ఎయిరిండియా సీఈవో క్యాంప్ బెల్ విల్సన్ కూడా ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి అక్కడ పరిస్థితులను వివరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరిస్థితిని ఆరా తీశారు. ఈ ఘటనలో బ్రిటన్ పౌరులు కూడా మరణించడంతో ఆ దేశానికి చెందిన హై కమిషనర్ అధికారులు కూడా అహ్మదాబాద్ చేరుకొని పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ప్రమాద ఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇక పోలీసు కుక్కల సాయంతో శిథిలాల కింద చిక్కుకున్న మృత దేహాలను గుర్తించే పనిలో పడ్డారు.

**మృతుల గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు**

అహ్మదాబాద్‌లో విమానం కూలిన ఘటనలో మృతుల గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం సివిల్ ఆస్పత్రిలో శవపరీక్షలు పూర్తి చేసినట్టు వైద్యాధికారులు ధ్రువీకరించారు. కుటుంబీకుల నుంచి రక్త నమూనాలను సేకరిస్తున్నామని అహ్మదాబాద్ ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి ధనుంజరు ద్వివేది వెల్లడించారు. డీఎన్ఏ ప్రక్రియ పూర్తి చేసిన మృతదేహాలను బంధువులకు అప్పగిస్తున్నామని తెలిపారు.

# బ్లాక్ బాక్స్ లభ్యం

- కఅహ్మదాబాద్‌లో విమాన ప్రమాద ఘటనలో కీలక పురోగతి
- ప్రమాద కారణాలు తెలిసే అవకాశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో కీలకమైన ఆధారంగా భావించే బ్లాక్ బాక్సు లభ్యమైంది. ప్రమాదం జరిగిన 27 గంటల తర్వాత ఈ బ్లాక్ బాక్సును ఓ భవనం పైకప్పుపై గుర్తించినట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రకటించింది. ఇప్పటికే బ్లాక్ బాక్స్ విశ్లేషణను ప్రారంభించామని, ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ దర్యాప్తులో పౌర విమానయాన శాఖ, రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 40 మంది, ఇతర నిపుణులతో కూడిన బృందాలు కలిసి పనిచేస్తున్నట్లు సమాచారం.

విమాన ప్రమాదాలకు సంబంధించి అసలు కారణాలు తెలుసుకోవడానికి బ్లాక్ బాక్స్ అనేది అత్యంత కీలకమైన భాగం. అందుకే ఇది దొరికిన వెంటనే, దాన్ని విశ్లేషించడం ప్రారంభించారు. బ్లాక్ బాక్స్‌లో రికార్డ్ అయిన డేటా, పైలట్ల మధ్య సంభాషణలు, ఫ్లైట్‌లో ఏవిధమైన సమస్యలు వచ్చాయన్నది స్పష్టత ఇస్తుంది.

గురువారం, అహ్మదాబాద్ నుండి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే, స్థానికంగా ఉన్న ఓ మెడికల్ కాలేజ్ హాస్టల్‌పై కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో విమానంలోని ప్రయాణికుల్లో ఒక్కరు తప్ప మిగతావారు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు గల అసలు కారణం ఇంకా వెల్లడికాలేదు. అయితే బ్లాక్ బాక్స్ అనలిసిస్ పూర్తయితే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



### బ్లాక్ బాక్స్ అంటే ఏమిటి?

ప్రతి కమర్షియల్ విమానంలో రెండు బాక్సులు ఉంటాయి: డిజిటల్ ఫ్లైట్ డేటా రికార్డర్ – ఇది విమానం టెక్నికల్ డేటాను రికార్డ్ చేస్తుంది. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ – పైలట్ మరియు కోపైలట్ మధ్య సంభాషణలను రికార్డ్ చేస్తుంది. విమానం ప్రమాదానికి గురైన సమయంలో, పైలట్‌లు Mayday, Maydayఅంటూ ఏటీసీకి సందేశాలు పంపిస్తారు. ఈ సమయానికి సంబంధించిన ప్రతీ విషయం బ్లాక్ బాక్స్‌లో రికార్డ్ అవుతుంది. ఈ బ్లాక్ బాక్సు ఆధారంగా ఇప్పుడే ప్రమాదం ఎలా జరిగింది, దానికి కారణం ఏమిటన్నదిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అత్యవసరంగా విమాన ఇంజిన్ పనిచేయనప్పుడు, విమానం మంటల్లో చిక్కుకున్న సమయంలో, గాలిలో ఏదైనా పక్షిలాంటిది ఢీకొన్న సమయంలో, హైజాక్ సమయంలో కూడా మేడే కాల్‌ను పైలట్లు ఏటీసీకి పంపుతారు. మేడే మెసేజ్ అందిన వెంటనే ఏటీసీ స్పందిస్తుంది. విమానానికి ఏదో అత్యవసర పరిస్థితి వచ్చిందని అర్థం చేసుకొని ఎయిర్ పోర్టు రన్ వేను క్లియర్ చేస్తుంది. సమీపంలోని అంబులెన్స్ సర్వీసులు, అగ్నిమాపక దళాలను అప్రమత్తం చేస్తుంది.

## దోస్త్ రెండోవిడతలో

## 43,568 మందికి సీట్ల కేటాయింపు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) రెండో విడత సీట్లను ఉన్నత విద్యామండలి కేటాయించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ వి బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దోస్త్ రెండో విడతకు 46,883 మంది విద్యార్థులు వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. వారిలో 43,568 మందికి సీట్లు కేటాయించామని చెప్పారు. మొదటి విడతలో సీట్లు పొందిన వారిలో రెండో విడతలో మెరుగైన కాలేజీ, కోర్సు కోసం వెబ్‌ఆప్షన్లను చేశారనీ, 6,077 మందికి కేటాయించామని వివరించారు. సరిపోయినన్ని వెబ్‌ఆప్షన్లను నమోదు చేయకపోవడం వల్ల 3,315 మందికి సీట్లు కేటాయించలేదని తెలిపారు. మొదటి ప్రాధాన్యత ద్వారా సీట్లు పొందిన అభ్యర్థులు 30,973 మంది ఉన్నారని పేర్కొన్నారు. రెండు, ఇతర ప్రాధాన్యతల ఆధారంగా 12,595 మందికి సీట్లు కేటాయించామని తెలిపారు. కామర్స్‌లో 13,900 మంది, ఫిజికల్ సైన్సెస్‌లో 11,277 మంది, లైఫ్ సైన్సెస్ (జీవ శాస్త్రాలు)లో 8,821 మంది, ఆర్ట్స్‌లో 5,032 మంది, ఇతర కోర్సుల్లో 4,538 మంది కలిపి మొత్తం 43,568 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా సీటును రిజర్వు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు ఈనెల 18 వరకు ఉందని తెలిపారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌తోపాటు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్ల నమోదుకు తుది గడువు ఈనెల 19 వరకు ఉందని తెలిపారు. ఈనెల 23న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://dost.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## స్థానిక ఎన్నికలపై 10 రోజుల్లో స్పష్టత

- తొలుత సర్పంచ్ ఎన్నికలు..
- తరువాతే ఎంపీటీసీ, జెడ్పీటీసీ..
- కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలపై వారం, పది రోజుల్లో ఒక స్పష్టత వస్తుందని పంచాయతీరాజ్, గ్రా మీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులంతా సిద్ధంగా వుండాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల అంతర్గత సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉమ్మడి కొత్తగూడ, గంగారం మండల్లాలో త్వరలో జరిగే సర్పం చ్, జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల్లో మనమే గెలవాలనీ దిశా నిర్దేశం చేశారు. మొదటగా సర్పంచ్, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు వెళ్ళే యోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల బదిలీలు కూడా జరుగుతున్నాయని అన్నారు. వారం రోజుల్లో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు వచ్చే నాటికి మండల నాయకులు కార్యకర్తలు గ్రామాల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజల్లోకి తీసు కెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, మండల ప్రధాన కార్యదర్శి బిట్ల శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణ రెడ్డి, జిల్లా నాయకులు లావణ్య వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు వైద్య పరీక్షలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సాధారణ ఆరోగ్య తనిఖీల్లో భాగంగా ఆయన ఆసుపత్రికి వెళ్లారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఏఐజీ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో కేసీఆర్‌కు కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల కోసం ఆయన మధ్యాహ్నం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇదిలా ఉంటే బుధవారం కాళేశ్వరం కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరైనప్పుడు ఆయన స్వల్ప అస్వస్థతకు గురైనట్టు వార్తలు వినిపించాయి. అనంతరం రెండు రోజులకే ఆస్పత్రికి రావడం కేసీఆర్ ఆరోగ్యంపై కొంత ఆందోళన కలిగిస్తోంది. అయితే సాధారణ వైద్య పరీక్షల కోసం ఆయన తరుచుగా తమ ఆస్పత్రికి వస్తారని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది.

## నేటి నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో బీటెక్, బీఈ, బీ ఫార్మసీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నుంచి 18 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. అదేనెల 17 నుంచి 19 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. అదేనెల 17 నుంచి 21 వరకు వెబ్‌ఆప్షన్లు నమోదు చేసేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. ఈనెల 25న తొలివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. 25 నుంచి 29 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు https://tgecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## టెంపుల్ టూరిజానికి మరింత ప్రోత్సాహం

- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆషాఢ మాస బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన సీజీఎఫ్ కమిటీ సమావేశంలో ఆమె కీలక మార్గనిర్దేశాలు చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలోని టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఎండోమెంట్ డిపార్ట్మెంట్ అధికారులు ముందుకు సాగాలని సూచించారు. వరంగల్ భద్రకాళి దేవాలయం ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ప్రజల్లో ధార్మిక చింతనను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సురేఖ పేర్కొన్నారు. అన్ని పండుగలు, సంప్రదాయాలను ప్రజల దృష్టికి తీసుకురావాలన్నదే ప్రభుత్వ అభిప్రాయమని తెలిపారు. సీజీఎఫ్ నిధులను పారదర్శకంగా వినియోగించాలంటూ అధికారులను ఆదేశించారు. చిన్న దేవాలయాల అభివృద్ధికి అవసరమైన నిధులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 72.47 కోట్ల విలువైన 297 పనులకు ఆమోదం లభించింది. ఈఓలు మరియు ఇతర అధికారులు ఫీల్డ్ స్థాయిలో సర్వే చేసి, ప్రాజెక్ట్ ప్రపోజల్స్ ఒక్కసారిగా సమర్పించాలని సూచించారు. రెండు, మూడుసార్లు ఒకే పనుల ప్రపోజల్స్ పంపటం సరికాదని స్పష్టం చేశారు. స్థానిక నాయకులు ఇచ్చే అంచనాలను క్రాస్ వెరిఫై చేసి మాత్రమే ప్రతిపాదనలు పంపాలన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేయండి

**- అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**




**బలగం టీవీ, హైదరాబాద్**

బల్కంపేట ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. జులై 1న కళ్యాణం, 2న రథోత్సవం జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఆలయం వద్ద ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, “అమ్మవారి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలి” అని పేర్కొన్నారు.

“ఆలయం ఎదుట ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటుతో భక్తులందరికీ కళ్యాణం వీక్షించే అవకాశం కల్పించాలి. క్యూ లైన్లలో తోపులాటలు కాకుండా బారికేడింగ్‌ల ఏర్పాటు చేయాలి. ఆలయ పరిసరాలలో మ్యాన్‌హోల్స్, డ్రైనేజీల లీకేజీలను తొలగించాలి. క్యూ లైన్లలో త్రాగునీరు అందించేందుకు ప్యాకెట్ల సరఫరా, సిబ్బంది ఏర్పాటు చేయాలి. అన్నదాన కార్యక్రమానికి అవసరమైన వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలి. పారిశుధ్య నిర్వహణ కోసం మూడు షిఫ్టుల్లో అదనపు సిబ్బందిని నియమించాలి. స్ట్రీట్ లైట్లు పనిచేసేలా, తాత్కాలికంగా అదనపు లైట్ల ఏర్పాటు చేయాలి. భద్రత కోసం సీసీ కెమెరాలు, అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ నియంత్రణ కోసం ట్రాఫిక్ డైవర్షన్ చేపట్టాలి. వాలంటీర్లకు ఫోటో గుర్తింపు కార్డులు అందజేయాలి. జోగినీలు, శివసత్తులకు ప్రత్యేక దర్శన సమయాన్ని కేటాయించాలి.

రథోత్సవం సందర్భంగా చెట్ల కొమ్మల తొలగింపు, రహదారుల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి. నాలుగు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలి. ఈ సమావేశంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిబాబా గౌడ్, కార్పొరేటర్ సరళ, జిల్లా వైద్యాధికారి డా. వెంకట్, ఆర్ అండ్ బి ఈఈ రవీంద్ర మోహన్, వాటర్ వర్క్స్ సీజీఎం ప్రభు, ఆలయ సూపరింటెండెంట్ హైమావతి, ఎలక్ట్రికల్ ఎ.డి. కిషోర్, స్ట్రీట్ లైట్ డీఈ కిరణ్మయి, శానిటేషన్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఎస్ఆర్ నగర్ సీఐ శ్రీనాథ్ రెడ్డి, జోగిని శ్యామల, బీఆర్ఎస్ నాయకులు హనుమంతరావు, అశోక్ యాదవ్, నర్సింహ, ప్రవీణ్ రెడ్డి, గోపిలాల్ చౌహాన్, పీయూష్ గుప్తా, బలరాం, ఉత్తమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేస్తా

**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**బలగం టీవీ, ఖమ్మం**

గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి తుపాల్గొన్నారు. రేగులచలక, కోయచెలక గ్రామాల్లో సీసీ రోడ్లు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.అనంతరం రఘునాథపాలెం మండలం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కులగణన చేసిన దమ్మున్న నాయకుడు రేవంత్‌రెడ్డి అని అభివర్ణించారు. దేశమంతా పాదయాత్ర చేసి కులగణనకు ఆలోచన చేసిన నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ చేసి మిగతా రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఉద్ఘాటించారు. దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పాలనలో దేశమంతా రూ. 70 వేల కోట్లు రుణమాఫీ చేస్తే.. తెలంగాణలో రూ. 21 వేల కోట్లు రుణమాఫీ చేశారని గుర్తుచేశారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా రైతు భరోసా విషయంలో వెనుకడుగు వేయబోమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రచారం చేయాలని కోరారు. ఇతర జిల్లాల వారు ఖమ్మంలో నివసించాలనే ఆలోచనలు వచ్చేలా ఖమ్మం నగరాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. అధికార పార్టీ వారు సర్పంచ్‌లు.. ఎంపీటీసీ జెడ్పీటీసీలుగా ఎన్నికైతే ప్రజలకు చేరువ కావొచ్చని చెప్పారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన రాజకీయ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. రైతు సంక్షేమమే ప్రజా పాలన ధ్యేయమని చెప్పారు. పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని అన్నారు. ప్రజాభిమానం ఉంటే పదవులు అవే దక్కుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.



## పఠాన్‌కోట్‌లో ఆర్మీ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పంజాబ్‌లోని పఠాన్‌కోట్ లో భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండ్ అయింది. నంగల్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాలెడ్ గ్రామంలో శుక్రవారం ఉదయం వాయుసేన హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్ అయ్యిందని.. అయితే, ఎటువంటి ప్రమాదం జరగలేదని ప్రాథమిక నివేదికలు తెలిపాయి. పఠాన్‌కోట్ వైమానిక దళ స్టేషన్ నుండి బయలుదేరిన హెలికాప్టర్ సాంకేతిక లోపం తలెత్తడంతో అత్యవసర ల్యాండింగ్ అయినట్లు సమాచారం. ముందు జాగ్రత్తగా ఓ ఖాళీ ప్రదేశంలో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. హెలికాప్టర్ దిగుతున్న దృశ్యాన్ని చూసిన గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని గుమిగూడారు.




## ఎయిర్‌ఇండియా విమానం అత్యవసర లాండింగ్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

మరో ఎయిర్ ఇండియా విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎయిర్‌ఇండియా ఎఐ379 విమానం ఉదయం 9.30 గంటలకు న్యూఢిల్లీకి బయలుదేరింది. అయితే ఈ విమానంలోని బాత్‌రూం గోడపై బాంబు బెదిరింపు రాసి ఉంది. దీన్ని గుర్తించిన వెంటనే పైలట్ విమానాన్ని తిరిగి ఫుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 156 మంది ప్రయాణికులు ఉన్నారు. విమానాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు బాంబు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే

**- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు**



**బలగం టీవీ, హైదరాబాద్**

ఫార్ములా ఈ కార్ల రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కాదు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారని అనడానికి కెటిఆర్‌కు ఇచ్చిన తాజా నోటీసులే నిదర్శనం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కెటిఆర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్ రెడ్డి నోటీసులు పంపించారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 18 నెలల పాలనలో డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తూ బిఆర్ఎస్‌ను బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం గెలిచే ప్రసక్తే లేదని, రేవంత్ రెడ్డి డ్రామా, డైవర్షన్ రాజకీయాలు ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యాయని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌తో తెలంగాణ ప్రతిష్ట పెరిగిందని, పెట్టుబడులు కూడా వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రతిష్ట పెంచినందుకా కెటిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం నోటిసుల ప్రతాపం..? అని ప్రశ్నించారు. 2000లో చంద్రబాబు ఫార్ములా వన్ కోసం కృషిచేసి నిర్వహించలేకపోయారని, అలాంటిది బిఆర్ఎస్ ప్రభుత్వం,కెటిఆర్ కృషి వల్ల ఫార్ములా వన్ వంటి ప్రతిష్టాత్మక రేస్‌ను భారతదేశానికి అందులోనూ హైదరాబాద్‌కి తీసుకొని వచ్చారని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తెలంగాణను మార్చేందుకు ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించి పెట్టుబడులను ఆకర్షించారని, అమర్ రాజా వంటి కంపెనీలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించి రాష్ట్ర పరువును, దేశ పరువును మంటకలిపిందని మండిపడ్డారు. అందాల పోటీతో లాభం లేదు కానీ రాష్ట్ర పరువు మాత్రం తీశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపినందుకు, రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నందుకు కెటిఆర్‌కి ఎసిబి నోటీసులు ఇచ్చిందని స్పష్టమైతున్నదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని రకాలుగా వేధించినా ఆయన వైఫల్యాలను ఎండగట్టడం మాత్రం బిఆర్ఎస్ ఆపదు అని హరీష్‌రావు స్పష్టం చేశారు.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులపై స్పందించిన ఎమ్మెల్సీ కవిత

**బలగం టీవీ, హైదరాబాద్**



ఫార్ములా ఈ కేసులో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నోటీసులపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా మా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కాంగ్రెస్ సర్కార్ మళ్ళీ నోటీసులు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను అని కవిత పేర్కొన్నారు. మీరు ఎన్ని కుట్రలు పన్నినా మీ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడుతూనే ఉంటాం అని కవిత స్పష్టం చేశారు. చివరగా జై తెలంగాణ జై కేసీఆర్ అని నినదించారు.

# ఓయూ పరిధిలో వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్, ఐడీ) మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) (ఐడీ, ఐ, డీ, హెచ్ఐ, ఏఎస్డీ) మూడు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

# వేములవాడ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ..

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ లోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల మరియు కళాశాల యందు మిగిలిన సీట్లకు గాను దరఖాస్తు స్వీకరణ జరుగుతున్నది. 5,6,7 మరియు 8 వ తరగతి విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్, బుద్ధి, సిక్కు,జైన) సీట్లకు అవకాశం కలదు. సంబంధిత ఆధార్ డాక్యుమెంట్లతో పాఠశాల యందు సంప్రదించగలరు. 100 శాతం పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన పాఠశాల అని మరియు సిరిసిల్ల జిల్లాలో ఇంటర్ ఒకేషనల్ లో రాష్ట్రస్థాయి ఇంటర్ లో మొదటి ర్యాంకు సాధించిన గురుకుల కళాశాలని ఇందులో ఎంఎల్‌టీ, డీటీ మొదటి సంవత్సరంలో మైనారిటీ సీట్లకు అవకాశం కలదు అని తెలిపారు. పూర్తి అనుభవాగ్యులైన అధ్యాపక బృందంతో ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీపడుతూ ప్రభుత్వ గురుకుల పాఠశాలను రాష్ట్రస్థాయికి తీసుకెళ్తూ విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థులకు పూర్తి ఉచితంగా అన్ని సదుపాలతో ప్రభుత్వం గురుకుల పాఠశాల యందు విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అడ్మిషన్ వివరాల కొరకు సంప్రదించవలసిన నెంబర్లు. 79950579080 , 8008973439 , ఇంటర్మీడియట్ 7097213355 అని తెలిపారు.

# బీహార్‌లో ఆప్ ఓంటరి పోరు

**బలగం టీవీ, హైదరాబాద్**

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకు సిద్ధమని ఆప్ ప్రకటించింది. 243 స్థానాల్లోనూ తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు బిహార్ ఆప్ చీఫ్ రాకేశ్ కుమార్ వెల్లడించారు. దీంతో మహాఘట్ బంధన్, ఎన్డీఏ కూటమి కాకుండా మూడో పక్షంగా ఆప్ పోటీ చేయనుంది. ఢిల్లీకి చెందిన రాజ్యసభ సభ్యుడు, ఆప్ సీనియర్ నాయకుడు సంజయ్ సింగ్ జూన్ 17న పట్నాలోని గర్దానీబాగ్ నుంచి బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించనున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య..

**-రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన విద్యలో మార్పు తీసుకువచ్చి, పెద విద్యార్థులకు మంచి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బడి బాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల దుస్తులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు..అనంతరం అంగన్వాడీ విద్యార్థులకు అక్షరఅభ్యాసం నిర్వహించారు.. ఈ సందర్భం గా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి విద్యార్థులకు మెరుగైన వసతులు అందించడమే లక్ష్యంగా ముందుకు పోతున్నారనిఅన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని గురుకులాల్లో డైట్ చార్జీలు 40%, కాస్మోటిక్ చార్జీలు 200% పెంచారని,రాష్ట్రంలోనే విద్యార్థులందరికీ ఒకే రకమైన నాణ్యమైన రుచికరమైన పౌష్టిక ఆహారం అందించడానికి ఒకే మెను తయారుచేసి అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పేది వింటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు పోవాలని,ప్రభుత్వం నాణ్యమైన ఉపాధ్యాయులతో విద్యా బోధన చేస్తుందని అన్నారు.విద్యా రంగానికి పెద్ద పీట వేస్తూ ప్రజా ప్రభుత్వంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలను చేపట్టిరన అన్నారు.. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పేది సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు.

రాష్ట్రంలోని ప్రతి పెద విద్యార్థికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్లో నిర్మాణం కోసం 200 కొట్లు ప్రభుత్వం మంజూరు చేశారనిఅన్నారు..రాష్ట్రంలోని ఎస్సి, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సైతం ఇంటర్నేషనల్ స్థాయిలో విద్య అందిస్తున్నామని,రుద్రంగి మండల కేంద్రంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ మంజూరు చేయడం జరిగిందని అన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను స్వంత బిడ్డల వలె చూసుకుంటుందని,రాష్ట్రంలో విద్య సంవత్సరం మొదలు కాక ముందే రాష్ట్రంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు.గత సంవత్సరం కూడా పాఠశాల ప్రారంభం రోజునే దుస్తులు పాఠ్యపుస్తకాలు పంపిణి చేయడం జరుగుతుందన్నారు

అమ్మ ఆదర్శ పాఠశాలల క్రింద రాష్ట్రంలో ని పాఠశాలల్లో అనేక కోట్లతో మౌలిక వసతుల కల్పించడం జరిగిందని,ప్రభుత్వం ప్రతీ ఎమ్మెల్యే కు ఇస్తున్న స్పెషల్ డెవలప్మెంట్ ఫౌండ్ లో పాఠశాలకు 15 శాతం ఇస్తున్నమని అన్నారు.. ఉపాధ్యయలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టీచర్ల ఒక చక్కటి వేదికబదిలీలు ప్రజా ప్రభుత్వంలో చేయడం జరిగిందని,వేసవి కాలంలో రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల కు ప్రత్యేక శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసుకోవడం జరిగింద న్నారు. త్వరలోనే నియోజకవర్గ పరిధిలోని పాఠశాలలోని ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులతో ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు ఎర్పాటు చేయాలని అధికారులకు సూచించారు..ఈ సమావేశం పాఠశాల బలేపోతం,పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు..

# ఘనంగా సామూహిక అక్షరాభాష్యం...





**బలగం టీవీ, సిరిసిల్ల:**

బడిబాటలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఎం పి హెచ్ ఎస్ పెద్దూరు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోతిలాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సరస్వతీ దేవుని ప్రార్థిస్తూ, విద్యార్థులచే ఓనమాలు దిద్దించి అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా మోతిలాల్ మాట్లాడుతూ ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థుల విద్యాభ్యాసం ప్రారంభిస్తు, వారు భవిష్యత్తులో ఉన్నతంగా చదివి మంచి విలువలు , ఉన్నత ఆశయాలతో జీవితంలో రాణించాలని ఆశీర్వదించారు. పెద్దూరు పాఠశాలలో చక్కని ఉపాధ్యాయ బృందం ఉందని, వారి యొక్క సేవలను, అద్భుతమైన జ్ఞానాన్ని గ్రామస్తులందరూ వినియోగించుకోవాలని , విద్యార్థులందరినీ స్థానిక పెద్దూరు పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు..ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, ఉపాధ్యాయ బృంద%శీ% గుండెల్లి రవీందర్ ,తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమ ,బైరివాణి శ్రీ , కదర్ల కల్పన, నాగుల వీణ , నందాల శంకర్ , రాజమల్లు, రవికుమార్ , మహేష్,అంగన్వాడీ టీచర్లు , తల్లిదండ్రులు , విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**రైలుబడి లో సామూహిక అక్షరాభ్యాసం..**

ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ (ఎస్సీ కాలనీ) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కందికట్కూరు గ్రామానికి చెందిన రాఘవేంద్ర హాస్పిటల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు పాఠశాల విద్యార్థులకు రంగులతో కూడిన టీ షర్ట్స్, పాయింట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల విద్యాధికారి శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నిర్మల,గాలిపల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పావని మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం రవీందర్ రెడ్డి అనువోజు రాజు, అంగన్వాడీ టీచర్ లక్ష్మీ , కందికట్కూర్ మాజీ ఎంపీటీసీ యాస తిరుపతి గ్రామ పెద్దలు బిగుల్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పోచమ్మ బోనాల వేడుకకు హాజరైన చల్మెడ

**బలగం టీవీ, సిరిసిల్ల**



చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో శుక్రవారం పోచమ్మ తల్లికి ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఇక్కడ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, ప్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, నాయకులు చిలుక పెంటయ్య, బైరగోని రమేష్, రమేష్ రావు, దుమ్ము ఆనందం, ఇస్మాయిల్, పోత రాజు తిరుపతి, నగేష్, రాజిరెడ్డి, ఏనుగుల శ్రీనివాస్, అజయ్, పెరుక సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



## రాజన్న ఆలయ నూతన ఈవోగా రాధా భాయ్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా (ఈవో) రాధా భాయ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న వినోద్ రెడ్డి హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ)గా బదిలీ అయ్యారు. వినోద్ రెడ్డి స్థానంలో వేములవాడ ఆర్డీఓ (రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్) రాధా భాయ్ కు దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ అభివృద్ధి, రోజువారీ కార్యకలాపాలను రాధా భాయ్ పర్యవేక్షిస్తారు. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు.



## కోడెలను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం..

**-కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, వేములవాడ**

కోడెల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,కోడెలను పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాఅన్నారు.శుక్రవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలను పరిశీలించి, అర్హులైన రైతులకు 50 జతల కోడెలను 100 జీవాలను అధికారులు రైతులకు పంపిణీ చేశారు. ఇప్పటిదాకా మొత్తం 375 జతలు..750 జీవాలు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ గోశాల నుంచి పంపిణీ చేసే కోడెలను కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. వాటిని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పక్కాగా చూడాలని సూచించారు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సంరక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం , జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, గోశాల కమిటీ సభ్యులు రాధా కృష్ణ రెడ్డి, పశు వైద్యాధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుంది..

**-బీఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్**

**బలగం టీవీ, సిరిసిల్ల**

తెలంగాణలో కార్పొరేట్, ప్రయివేటు స్కూళ్లు మండల స్థాయి వరకు విస్తరించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుంటే, ప్రభుత్వ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సబ్బని హరీష్ మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో పాత బస్టాండ్ లో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యానగర్లో గల శ్రీ చైతన్య నారాయణ స్కూల్లో ఒకటవ తరగతి 30,000 నుండి 50 వేల రూపాయలను, అదే విధంగా పాఠశాలలో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కాకుండా, ఆ స్కూలు ముద్రించిన పాఠ్యపుస్తకాలు,స్కూల్ యూనిఫామ్స్ అమ్ముతూ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారుప్రవేట్ పాఠశాలలు నిబంధనలు అతిక్రమిస్తున్నా,తమకేమీ పట్టనట్టుగా విద్యాశాఖ అధికారులు ఉన్నారని, యూనిఫామ్స్, బుక్స్, నోట్ పుస్తకాలకు తమ వద్దే కొనాలని హుకుం జారీ చేస్తున్నాయని అన్నారు. కార్పొరేట్ స్కూళ్లు ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలను కాకుండా వారు రూపొందించిన పాఠ్యపుస్తకాల ద్వారా బోధన చేస్తున్నారని, దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రవేట్ పాఠశాలలో చదివిన విద్యార్థులకు సామాజిక అంతరం ఏర్పడి తీవ్రమైన మానసిక వేదనకు గురవుతున్నారని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపైన చర్యలు తీసుకొని ఈ విద్యా సంవత్సరం నుండి ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇంచార్జ్ బాబా, మేట్టల సాయి దీపక్, వలబొజు వెంకటరమణ, కనుకుంట్ల వెంకటరమణ అశోక్ తదితరులు పాల్గొన్నారు



# విమాన ప్రమాద మృతులకు క్రికెటర్లు సంతాపం..

**బలగం టీవి, హైదరాబాద్**



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న ఘోర విమాన ప్రమాదంపై టీమిండియా ఆటగాళ్లు తమ సంతాపాన్ని ప్రకటించారు. ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన భారత ఆటగాళ్లు.. శుక్రవారం ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్ ప్రారంభానికి ముందు నిమిషం పాటు మౌనం పాటించారు. అంతేకాకుండా బ్లాక్ రిబ్బన్స్‌తో ఈ మ్యాచ్ ఆడారు. ఆటగాళ్ల సంతాప విషయాన్ని సోషల్ మీడియా వేదికగా బీసీసీఐ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను పంచుకుంది. 'బెకెన్‌హమ్ వేదికగా జరుగుతున్న ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో పాల్గొన్న ఆటగాళ్లు, కోచింగ్ స్టాఫ్ నల్ల రిబ్బన్లతో బరిలోకి దిగారు. అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న విమాన ప్రమాదంలో మరణించిన వారికి ఒక నిమిషం పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు.'అని బీసీసీఐ తమ పోస్ట్‌లో పేర్కొంది.

ఇక అహ్మదాబాద్ విమాన ప్రమాదం ఘటనపై లార్డ్స్ మైదానంలో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆడుతున్న ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఆటగాళ్లు శుక్రవారం సంతాపం తెలిపి.. నల్ల రిబ్బన్లు ధరించారు. డబ్ల్యూటీసీ ఫైనల్ మూడో రోజు ఆసీస్, సఫారీ ఆటగాళ్లు మృతులకు సంతాపం తెలిపారు. తొలి సెషన్ ప్రారంభానికి ముందు ఇరుజట్ల ఆటగాళ్లు, స్టేడియంలోని ప్రేక్షకులు అందరూ నిల్చొని నిమిషం సేపు మౌనం పాటించారు. ఆ తర్వాత భుజానికి నల్ల రిబ్బన్లు కట్టుకొని మైదానంలోకి దిగారు దక్షిణాఫ్రికా ప్లేయర్లు.

## వచ్చే ఏడాది ఉప్పల్‌లో టీ20 మ్యాచ్

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉన్న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో వచ్చే ఏడాది టీ20 మ్యాచ్ జరగనుంది. జనవరిలో భారత పర్యటనకు రానున్న న్యూజిలాండ్‌తో టీమ్‌ఇండియా ఇక్కడ ఒక టీ20 మ్యాచ్ ఆడనుంది. మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడేందుకు గాను కివీస్ జట్టు జనవరిలో భారత్‌కు రానుంది. ఈ మేరకు బీసీసీఐ.. హైదరాబాద్‌తో పాటు జైపూర్, మొహాలి, ఇండోర్, రాజ్‌కోట్, గువహతి, త్రివేండ్రం, నాగ్‌పూర్ వేదికలను ఖరారు చేసినట్టు సమాచారం. శనివారం జరుగబోయే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం అనంతరం ఇందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ వెలువడనుంది. ఉప్పల్‌లో చివరిసారిగా భారత్.. నిరుడు అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో మ్యాచ్ ఆడింది.

# మార్క్రమ్ సెంచరీ.. గదకు చేరువగా దక్షిణాఫ్రికా

- **రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 2 వికెట్లకు 185 పరుగులు**
- **సఫారీల విజయానికి ఇంకా 69 పరుగులు అవసరం**
- **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 207 పరుగులకు ఆలౌట్**



**బలగం టీవి, హైదరాబాద్**

ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా గెలుపుకు చేరువైంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఈ తుది పోరులో దక్షిణాఫ్రికా మూడో రోజు, శుక్రవారం ఆట ముగిసే సమయానికి తమ రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 185 పరుగులు చేసింది. కెప్టెన్ టెంబా బవుమా, ఏడెన్ మార్క్రమ్ అద్భుతమైన భాగస్వామ్యంతో జట్టును విజయానికి చేరువ చేస్తున్నారు.'గద'ను చేజిక్కించుకునేందుకు గాను 69 పరుగుల దూరంలో నిలిచింది.

ఆస్ట్రేలియా.. ఓవర్ నైట్ స్కోరు (144/8)కు మరో 63 పరుగులు జోడించింది. 25 ఓవర్ల పాటు ఆ జట్టు సఫారీ పేసర్లను నిలువరించింది. హాజిల్‌వుడ్ (17) అండగా స్టార్క్ పోరాడాడు. ఆట రెండో రోజు కేరీతో కలిసి 8వ వికెట్‌కు 61 పరుగులు జతచేసిన అతడు.. మూడో రోజు చివరి వరుస బ్యాటర్ హాజిల్‌వుడ్‌తో కలిసి 10వ వికెట్‌కు 59 రన్స్ జోడించాడు. ఆస్ట్రేలియా నిర్దేశించిన 282 పరుగుల ఛేదనలో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సఫారీలు 213/2తో గెలుపు దిశగా సాగుతున్నారు. ఓపెనర్ ఎయిడెన్ మార్క్మ (159 బంతుల్లో 102 నాటౌట్, 11 ఫోర్లు) తన కెరీర్‌లో చిరస్మరణీయ శతకంతో కదం తొక్కగా కెప్టెన్ టెంబ బవుమా (121 బంతుల్లో 65 నాటౌట్, 5 ఫోర్లు) అదరగొట్టడంతో సఫారీలు లక్ష్యానికి చేరువయ్యారు.

## 'మేం చెప్పామంటే, పక్కా చేస్తామంతే'




**బలగం టీవి, హైదరాబాద్**

ప్యాన్ ఇండియా స్టార్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా టీజర్ జూన్ 16న రానున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. కానీ, మరోసారి టీజర్ రిలీజ్ వాయిదా పడనున్నట్లు ప్రచారం సాగింది. దీనిపై మేకర్స్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. చెప్పినట్లే జూన్ 16న టీజర్ రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో మరో పోస్ట్ షేర్ చేశారు. 'మేం చెప్పామంటే, పక్కా చేస్తామంతే. జూన్ 16' అంటూ రాసుకొచ్చారు. ' డైనోసర్ ఇన్ డార్లింగ్ అవతార్' అనే డిజైన్‌తో ఉన్న పోస్టర్ షేర్ చేశారు.అలాగే ఈ సినిమాకు సంబంధించి కంటెంట్, ఫొటోలను ఇతరత్రా ఏమైనా సోషల్ మీడియాలో లీక్ చేసినట్లైతే కఠిన చర్యలు ఉంటాయని మేకర్స్ హెచ్చరించారు. దీనికి సంబంధించిన అకౌంట్లు కూడా నిలివేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఎవరు కూడా ఎలాంటి లీకేజీలు ఇవ్వొద్దని, ఈ విషయంలో తమతో సహకరించాలని కోరారు. ఈ టీజర్‌ను అందరం కలిసి సెలబ్రేట్ చేసుకుందామంటూ ఎక్స్‌లో పోస్ట్ షేర్ చేశారు.

# భారత్‌కు తిరిగొచ్చిన గంభీర్



**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా క్రికెట్ కోచ్ గౌతం గంభీర్ ఇంగ్లండ్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చాడు.ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత జట్టుతో పాటు ఉండాల్సిన గంభీర్, కుటుంబ అత్యవసర పరిస్థితి కారణంగా ఇంగ్లాండ్ పర్యటనను మధ్యలోనే వదిలి స్వదేశానికి తిరిగి వచ్చారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, గౌతమ్ గంభీర్ తల్లి గుండెపోటుకు గురయ్యారు. ప్రస్తుతం ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో ఐసియులో చికిత్స పొందుతున్నారు. ఈ కారణంగానే గంభీర్ తన తల్లి వద్ద ఉండటానికి వెంటనే భారత్‌కు తిరిగి రావాల్సి వచ్చింది. జూన్ 20న ప్రారంభం కానున్న ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు భారత జట్టు సన్నాహాల్లో భాగంగా గంభీర్ గత వారం ఇంగ్లాండ్‌కు వెళ్లారు. శుభమన్ గిల్ కెప్టెన్సీలో రానున్న ఈ సిరీస్ కొత్త శకానికి నాంది పలకనుంది.గంభీర్ తిరిగి ఇంగ్లాండ్‌కు తిరిగి సిరీస్‌కు అందుబాటులోకి వస్తారని భావిస్తున్నారు. ఈ కఠిన సమయంలో ఆయన తల్లి త్వరగా కోలుకోవాలని, గంభీర్ కుటుంబానికి ధైర్యం చేకూరాలని అందరూ ఆశిస్తున్నారు.



# నెట్‌ఫ్లిక్స్‌లోకి 'రానా నాయుడు 2'..

**బలగం టీవి, హైదరాబాద్**

విక్టరీ వెంకటేష్, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో నటించిన 'రానా నాయుడు' వెబ్ సిరీస్ సీజన్ 2 తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులో ఉంది. అమెరికన్ సిరీస్ రే డోనవన్‌కి రీమేక్‌గా వచ్చిన ఫస్ట్ సీజన్ మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీనికి కొనసాగింపుగా రెండో సీజన్‌ను తీసుకువచ్చారు మేకర్స్. కరణ్ అంశుమాన్, సుపర్ణ్ ఎస్. వర్మ సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌లో సుర్వీన్ చావ్లా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, గౌరవ్ చోప్రా, ప్రియ బెనర్జీ, రాజేష్ జైస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

## 'కుబేర', 'కూలీ'లలో రెండు పాత్రలు భిన్నంగా ఉంటాయి

- **నటుడు నాగార్జున**

**బలగం టీవి, హైదరాబాద్**

నటుడు, టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున తాను ప్రస్తుతం నటిస్తున్న రెండు ప్రతిష్ఠాత్మక చిత్రాలైన 'కుబేర', 'కూలీ'లలో తన పాత్రలు పూర్తి భిన్నంగా, ఒకదానితో మరొకటి ఏమాత్రం పోలిక లేకుండా ఉంటాయని స్పష్టం చేశారు. "రెండు చిత్రాల్లోనూ నా లుక్స్, బాడీ లాంగ్వేజ్, నేను మాట్లాడే భాష, నా స్టైల్... ఇలా ప్రతీ విషయంలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. 'కుబేర'లోని పాత్రకు, 'కూలీ'లోని పాత్రకు ఎక్కడా చిన్న పోలిక కూడా కనిపించదు. ఈ రెండు చిత్రాలు ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతాయన్న పూర్తి నమ్మకం నాకుంది" అంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఓ ప్రముఖ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ రెండు సినిమాల విశేషాలను పంచుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా, లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రం గురించి నాగార్జున ఉత్సాహంగా మాట్లాడారు. "ఇది పూర్తిస్థాయిలో విజిల్స్ కొట్టించే సినిమా. ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని అందిస్తుంది" అని తెలిపారు. ఈ చిత్రంలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, తనను లోకేశ్ తెరపై చూపించిన విధానం చూసి ఆశ్చర్యపోయానని అన్నారు. "తొలిసారి విజువల్స్ చూసినప్పుడు, 'ఇది నేనేనా?' అనిపించింది. లోకేశ్ కి నా హృదయ పూర్వక ధన్యవాదాలు. ఆయన సినిమాల్లో పాత్రల చిత్రణ అద్భుతంగా ఉంటుంది. నాకు 'విక్రమ్' సినిమా ఎంతగానో నచ్చింది. అందులో ఫహద్ ఫాజిల్, విజయ్ సేతుపతి పాత్రలు ఎంత అద్భుతంగా ఉంటాయో, అలాగే 'కూలీ'లో కూడా ప్రతి పాత్ర ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది. అదే ఈ సినిమాకు అతిపెద్ద ప్లస్ పాయింట్" అని నాగార్జున వివరించారు. చెన్నైలో లోకేశ్ కనగరాజ్‌కు ఉన్న అశేష అభిమాన గణాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని కూడా ఆయన గుర్తుచేసుకున్నారు.ఇక ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో, జాతీయ అవార్డు గ్రహీత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'కుబేర' చిత్రం గురించి మాట్లాడుతూ "శేఖర్ కమ్ముల తెలుగు ప్రేక్షకులకు అత్యంత ఇష్టమైన దర్శకుల్లో ఒకరు. ఆయనంటే నాకూ అమితమైన అభిమానం. ఆయన తీసిన సినిమాలన్నీ చూశాను. కథల ఎంపికలో ఆయన శైలి చాలా ప్రత్యేకం. రొటీన్ జానర్లకు భిన్నంగా, ఒక ప్రత్యేకమైన పంథాలో ఆయన చిత్రాలు ఉంటాయి" అని ప్రశంసించారు. అయితే... 'కుబేర' కథతో శేఖర్ తన వద్దకు వచ్చినప్పుడు, "శేఖర్, నువ్వు నిజంగానే ఈ సినిమా చేయాలనుకుంటున్నావా?" అని తాను ప్రశ్నించానని నాగార్జున గుర్తుచేసుకున్నారు. "ఎందుకంటే, ఇది ఆయన రెగ్యులర్ స్టైల్‌కు చాలా భిన్నంగా ఉంటుంది. ఈ కథలో ప్రేక్షకులను ఆలోచింపజేసే, సమాజంలోని కొన్ని కఠిన నిజాలున్నాయి. శేఖర్ కమ్ముల ఎంతో పరిశోధన చేసి ఈ సినిమా తీస్తున్నారు" అని అన్నారు.